

# అర్ఘాంతె

పోలాప్రగడ జనార్దనరావు

అత్తారింటికి సంక్రాంతికి వచ్చిన కొత్త అల్లుడితోమావ పెదకాపు బిల్లకట్టుమీద కాలవ దాటుతున్నాడు.

"ఓరేయ్ గంగరాజు పంటలు యింటి కొచ్చాయ్. సందేళ యింటికొచ్చి గింజ లెట్టు కెళ్ళరా."

"అల్లాగే బాబయ్య.తమదయ" అంటూ అవతల గట్టుకి చేర్చాడు. తోపుడు కర్రలా బక్కచిక్కిన బిల్లకట్టుగంగులు.

కాలవగట్టుమీదనుంచి ఏటిగట్టు యెక్కుతూంటె ఉప్పర పేరయ్య పెదకాపుకి ఎదురయ్యాడు. అంత దూరంనుంచి ఏటిగట్టు దారి వదిలి పక్కకి తప్పుకొని ముళ్ళ కంచిలో కాలేసి తీసుకోకుండా ఒదిగిఒదిగి నుంచున్నాడు.

"ఒరేయ్ పేరిగా పంటలొచ్చేసాయ్. ఇంక కళ్ళానికి కావలా అనొవుసరం. ఇంటికెళ్ళి హాయిగా (పెళ్ళాంకాడ అనబోయి చదువుకున్న అలుడిముందు సేఁవైపోతాం అని వూరుకొని) తొంగో........ సందలకాడే యింటికొచ్చి గింజలట్టుకెళ్ళు"

"తమ దయబాబూ" అంటూ అయ్యగారు వెళ్ళేవరకు ఆగి వంగి ముల్లు తీసుకొని కాలులోంచివచ్చిన రక్తాన్ని ఉమ్మితో తుడుచుకొని అయ్యగారుకనుమాపు అయ్యేవరకు నిలబడి తరువాత కదిలాడు వీరబాహుడిలా వున్న కుప్పల్ని కావలా కాసే ఉప్పర పేరయ్య.

ముందరకు అడుగు వెయ్యబోయే మావని టక్కుని ఆపాడు అల్లుడు. పకృతి కాంత పాత ఫేషన్ అయిందని పారేసిన పసిడి బంగారపు ఒడ్డాణంలా మెరిసిపోతున్న త్రాచుపాము జరజర పాకుంటూ గడ్డివాములోకి మాయమయ్యింది.

వెంటనే ఏనాది ఏసుబుకి కబురెళ్ళింది.

గడ్డివాము పడగొట్టకుండా (పడగొడితే మళ్ళీ పెదకాపుకి అనవసరంగా ఖర్చుఅవుతుందని) వీలులేకపోయినా ఒడుపుగా కాపెయ్యబోయే కాలనాగుని పట్టుకొని కుండలోపెట్టి భుజంమీద వున్న ఒక్క గుడ్డతీసి వాసిన కట్టాడు మాసిపోయి అతుగుల గుడ్డలా వున్న ఏనాది ఏసుబు.

వాడు చేసిన పనికి మావ మీసంమెలేసి "ఓరేయ్ ఏసుబు సాయంత్రం కనబడరా" అన్నాడు.


ఆంధ్ర పాఠకులకు ఉగాది కానుకలు!

శ్రీమతి యద్దనపూడి కళావర్ధని

నవలలు

| | |
|---|---|
| కోయిల కూసింది | రు. 8-00 |
| విశ్వ విజేత | రు. 8-00 |

* మీ సమీపంలోని పుస్తకాల షాపులో అడగండి. లేదా మా కు పుస్తకం ధర M.O. చేస్తే రిజిష్టర్డ్ పోస్టులో పంపుతాం. పోస్టేజి ఉచితం.
* ఏజెంట్లకు ఆకర్షణీయమైన కమీషన్. వివరములకు సంప్రదించండి.

కాదంబరి గ్రంథమాల,
10/244, అంకాలవారి వీధి, బలరాముని పేట,
మచిలీపట్నం-521 001.



రుచికరమైన మెత్తని వడలు క్షణంలో!



ఆర్కే
ఇన్‌స్టెంట్ వడ మిక్స్
జామూన్ మిక్స్, దోశ మిక్స్
కూడా దొరుకుతాయి.




శ్రీ రామకృష్ణ డయిరీ
179, విశ్వేశ్వర పురం
బెంగుళూర్ 560 004
టెలిఫోన్: 603481

Dattaram RD 6

సాయంత్రం పెద్దపాలేర్ని పిలిచాడు పెదకాపు ఎదురుగావున్న భృత్యుల్ని చూసూ—

"ఒరేయ్! బల్లకట్టు గంగులుకు ఐదు కుంచాలు ధాన్యం కొలవరా" అన్నాడు.

ఆ మాట వినేసరికి అల్లుడికి అసూయ కలిగింది. ఒకసారి కాలవ దాటిస్తే ఐదు కుంచాలా ? అనుకుంటూ భార్య కేసి అనుమానంగా చూశాడు. ఆ యిల్లాలు ఆ చూపుల్లోని అసూయని అర్థం చేసుకొంది.

"వాడు ఏడాది పొడుగునా మానాన్నని. మా పాలేళ్ళని. మా పసువుల్ని రాత్రనక పగలనక, వరదనక, వాననక కాలవ దాటిసూ వుంటాడు" అందుకే ఈ ప్రతిఫలం అన్నట్టు చూసింది.

"ఒరేయ్ పేరిగాడికూ్కడా నాలుగు కుంచాలు కొలవరా!"

"మరి వీడి మాటేమిటి" అన్నట్టున్నాయి అల్లుడి చూపులు. "వాడు పాములు తిరిగే చేలల్లో, దెయ్యాలు కయ్యాలాడుకునే కళ్ళంలో పెళ్ళాం బిడ్డల్ని వదిలి మా కుప్పల్ని. కాయల్ని. కాలువల్ని ఏడాది పొడుగునా కావలా కాస్తూ వుంటాడు" అంటూ అలుడు అనుమానానికి అంత్యక్రియలు చేసింది. అంతే పట్నం అల్లుడికి అర్థమయ్యింది. వాళ్ళుచేసే కషానికి మావ యిచ్చే ప్రతిఫలానికి బేరీజు వెయ్యలేకపోయింది మనస్సు. తను చదివిన చదువులో యిది ఏ అనుపాతమో అర్థమవలేదు.

ఇంతలో ఏనాది ఏసుబు త్రాచుపాముని అయ్యగారి ముందర ఆడించాడు.

చూసారా గొప్పోళ్ళ చేలల్లో గొప్ప తాచులే వుంటాయి అన్నట్టుగా వందిమాగధుల కేసి తలతిప్పి మీసం మెలేసి:

"ఒరేయ్! ఈడికి రెండు కుంచాల ధాన్యం కొలవరా! అన్నట్టు ఏసుబూ! తాసుపాం సెర్మం మాదిగాడి కియ్యరా. ఆడు దాంతో నాకేదో కుడతానన్నాడు" అంటూ హుకుం జారీచేశాడు, బేరం ఆడకుండా పాముని పట్టుకుందుకు ప్రతిఫలం రెండు కుంచాల ధాన్యం.

భార్యకేసి చూశాడు అల్లుడు. ఆమె ఏదో చెప్పబోతూంటె అర్థమయిందిలే అన్నట్టు సౌంజ్ఞ చేశాడు.

పెళ్ళాంతో పట్నానికి ప్రయాణమయ్యాడు అల్లుడు.

మామగారు శ్రద్ధాభక్తులతో సమర్పించుకున్న బట్టలు, డబ్బు పుచ్చుకొని బల్లకట్టు గంగులుకి, ఉప్పర పేరయ్యకు, ఏనాది ఏసుబుకు యిచ్చాడు.

"చూడు మామయ్యా! వాళ్ళు నీదగ్గర యింతఅని ఆశించకుండా నీ ప్రాణాన్ని.



ఋతువులన్నీ వసంతాలె మాకు
రోజులన్నీ పండుగలే మాకు"

— ఆచార్య తిరుమల

చిత్రం : ఎస్.టి.వి. శేషు, హైద్రాబాద్

ఆ స్త్రీనీ అహోరాత్రులు కావలకాస్తున్నారు. నేను నా బాధ్యతను స్వార్థంతో నిర్వహిస్తున్నందుకు ఈ మామూళ్ళు కట్టబెట్టావు. ఈ మామూళ్ళకి వాళ్ళే అర్హులు" అంటూ భార్యతో బండెక్కాడు. ●

# శలభం



"శారిక"

అమావాస్య రేచీకటిలో కనులు కనబడక టపటపా రెక్కలు కొట్టుకుంటూ దిక్కు తెలియక తిరుగాడుతోంది ఒక శలభం, ఎటుపోయినా గాఢాంధకారం. అంతలో ఎక్కడ నుంచో చీకటిని చీల్చుకొంటూ ప్రసరించిందో వెలుగు రేఖ. వెలుతురు తాకిన శలభం కళ్ళు ఆనందంతో మిలమిల మెరిశాయి. వేగంగా రెక్కలు ఆడిస్తూ నాట్యం చేసింది.

వెలుగు రేఖను వెంబడించి శలభం వెలుతురును సమీపించింది. నిర్విరామంగా వెలుగుతున్న ఆ దీపంచుట్టూ గిరికీలు కొట్టింది. పిల్లిగంతులు వేసింది. అంతలోనె దీపాన్ని చేరబోతున్న శలభం మదిలో ఉదయించిందో సందేహం.

ఏమిటీ దీపం ? ఇక్కడ ఎందుకు ఉంది ? రా రమ్మని తనవైపు ఎందుకు నన్నిలా ఆకర్షించుకొంటోంది ?

దీపంవైపు ఎగరబోయిన శలభం తన గమనాన్ని మార్చుకొంది. అనుమానంతో అటువైపుచూస్తూ అక్కడే అటూ ఇటూ తిరుగసాగింది.

దీపంగు ర్తించింది శలభం సందేహాన్ని. శలభాన్నుద్దేశించి పలికింది.

"ఏల నీకీ అనుమానం ? అంధకారంలో అల్లల్లాడుతున్న నీకు కాంతి చూపించడానికే ఇక్కడ నెలవున్నాను నేను. రా.... రా.... నన్ను చేరుకో!"

నిజంగానా అన్నట్లు రెక్కలు రెపరెపలాడించింది శలభం. నీ దగ్గరకు వస్తే నాకేమీ హాని కలుగదా అన్నట్లు చూసింది.

"ఎందుకు కలిగింది నీకీ అపనమ్మకం? నీకు హాని చేసేవాడినయితే నన్ను నేనే యిలా కాల్చుకొని నీ కెందుకు వెలుగు ప్రసాదిస్తాను?"

"నిన్ను కాలుస్తున్నది కరగిపోతున్న నీ వయసు కావచ్చు. నువ్వు ప్రసాదిస్తున్న వెలుతురు నీ స్వార్థం కోసమే కావచ్చు. లేకపోతే. అంత వెలుగులు విరజిమ్ముతున్నా నీ క్రింద చీకటి చూడు ఎలా గూడు కట్టుకొందో ?"

అలా ఆరోపణలు చేస్తున్న శలభం వైపు కళ్ళెర్రచేసి చూసింది దీపం. నిన్నేం చేస్తానో చూడు అన్నట్లు భగభగా మండింది.

భయపడింది శలభం. దూరంగా జరిగింది. వెనుదిరిగి పరుగెత్త నారంభించింది.

"అయ్యో! ఆగు నా శలభమా! ఎటు అలా చీకట్లోకి వురకలు వేస్తున్నావు? ఆగు! నా మాటలు విను."

దీపం దీన వాక్యాలు విని శలభం ఆగింది. ఏమిటన్నట్లు దీపం వైపు చూసింది.

"ఎందుకు ఇలా మాటిమాటికీ నన్ను శంకిస్తున్నావు నువ్వు ? ఎందుకు ఇలా వెనుక ముందులాడుతున్నావు ? నీకంటె ముందు ఎందరో నీ వాళ్ళు నన్ను చేరుకొన్నారు. వాళ్ళకు లేని సందేహాలు నీకెందుకు వచ్చాయి? రా....రా....నన్ను